సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



మెడికల్ కాలేజీ విద్యార్థుల హవా
ఏలూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాల్లో సత్తాచాటారు. 8లో ▸



కాళ్లకూరు వెంకన్నకు జలాభిషేకం
కాళ్లకూరులోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తనదీ జలాలతో అభిషేకాలు ఘనంగా జరిగాయి. 8లో ▸



భగ్గుమన్న కౌన్సిల్
నరసాపురంలో అన్న క్యాంటీన్ ప్రారంభం సందర్భంగా ఫ్లెక్సీలు చించివేతపై నరసాపురం కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. 8లో ▸

బాబుకు సద్బుద్ధి ప్రసాదించు స్వామి

కుతంత్రంపై ధర్మాగ్రహం
- తిరుమల లడ్డూపై దుష్ప్రచారం
- టీడీపీ కుట్ర రాజకీయాలపై సర్వత్రా ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆలయాల్లో పూజలు
- ప్రభుత్వ పాప ప్రక్షాళన జరగాలని ఆకాంక్ష
- జిల్లా అధ్యక్షుడు ముదునూరి ఆధ్వర్యంలో కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తిరుమల తిరుపతి లడ్డూపై దుష్ప్రచారం చేసి ఆలయ పవిత్రతను దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టీడీపీ శ్రేణులకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమలను రాజకీయాలకు వాడుకుంటున్న చంద్రబాబు తీరుపై, డైవర్షన్ రాజకీయాలపై పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ధ్వజమెత్తి పాప ప్రక్షాళన కోసం ఆలయాల్లో ప్రార్థించారు. ఏలూరు జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, నరసాపురం, పాలకొల్లులో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, తణుకులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగ్గా.. టీడీపీ కుటిల రాజకీయాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అన్ని నియోజకవర్గాల్లోని మండలాల్లో పార్టీ పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేయించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ నాయకులు పూజలు చేయించారు. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, ఆచంట మదనగోపాలస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చంద్రబాబు మత రాజకీయాలు మానాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



నరసాపురం : రాజగోపాలస్వామి ఆలయంలో పూజలు చేయించి వస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, పార్టీ శ్రేణులు

నరసాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు నీచ మత రాజకీయాలు మానుకోవాలని, తిరుమల దేవదేవుడి ప్రతిష్టత, పవిత్రతను దిగజార్చే చర్యలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు డిమాండ్ చేశారు. చంద్రబాబు చేస్తున్న పాపాలు ప్రక్షాళన కావాలని కోరుతూ శనివారం ముదునూరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పట్టణంలోని స్టీమర్‌రోడ్డులోని ప్రసిద్ధ రాజగోపాలస్వామి ఆలయంలో అర్చనలు చేయించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఆలయానికి చేరారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ జరగని తప్పును జరిగినట్టుగా చంద్రబాబు, కూటమి నేతలు చేస్తున్న ప్రచారం దారుణమన్నారు. రాజకీయాల్లోకి ప్రపంచ ప్రసిద్ధి పొందిన తిరుమలను తీసుకురావడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఈ ఉదంతంపై తమ పార్టీ అధినేత సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారని, తామూ అదే డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే జగన్‌ను తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. పార్టీ కేంద్రపాలకమండలి సభ్యుడు పీడీ రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, పార్టీ నేతలు షేక్ బుజి మస్తాన్, తిరుమాని నాగరాజు, కావలి నాని తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలకొల్లులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలూరు జిల్లాలో..

- ఏలూరులోని ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ ప్రత్యేక పూజలు చేయించారు.
- కైకలూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- నూజివీడులోని వేంకటాచలస్వామి ఆలయం, నూజివీడు మండలం రఘునాథస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు ప్రత్యేక పూజలు చేశారు.
- పోలవరం నియోజకవర్గంలో కొయ్యలగూడెం, బుట్టాయగూడెంలోని శివాలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.
- చింతలపూడి నియోజకవర్గం కామవరపుకోటలోని వీరభద్రస్వామి ఆలయంలో, జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమలలో చిన వెంకన్న ఆలయ పాదాల వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు టెంకాయలు కొట్టి చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని పూజలు చేయించారు.
- దెందులూరు, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు మండలాల్లో పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయించారు.

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్ : వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన సీఎం చంద్రబాబుకు గుణపాఠం తప్పదని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పాదయాత్రగా వెళ్లి ప్రక్షాళన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్థ రాజకీయాలకు దేవుడిని సైతం అపహాస్యం చేస్తున్న చంద్రబాబు నీచరాజకీయాలకు స్వస్తి చెప్పాలన్నారు. చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నామన్నారు. వంద రోజుల పాలనలో ప్రజలకు ఏమీ చేయలేదని, ప్రభుత్వంపై అపవాదు రాకుండా భగవంతుడిపై అపవాదులు వేయడం సరికాదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ఆలయాలన్నింటినీ అభివృద్ధి దిశగా తీర్చిదిద్దామన్నారు. తమ ప్రభుత్వంలో ప్రారంభించిన ఆలయ నిర్మాణాలను చంద్రబాబు నిలిపివేయడం దారుణమన్నారు. గత గోదావరి పుష్కరాల సమయంలో 29 మందిని పొట్టన పెట్టుకుంది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మా నాన్న దేవుడని ఓసారి, తాను క్రిస్టియన్ అని మరోసారి, ముస్లిం అని ఇంకోసారి నోటికొచ్చినట్టు చెప్పారని, ఇటీవల ఆయన కుటుంబసభ్యులతో తిరుమల వెళ్లిన సమయంలో డిక్లరేషన్ ఇచ్చారా అని ప్రశ్నించారు.

భక్తుల మనోభావాలను పణంగా పెట్టి..

మాజీ మంత్రి కారుమూరి



తణుకు అర్బన్ : ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: రాజకీయ స్వార్థం కోసం కలియుగ దైవం వేంకటేశ్వరస్వామినే అస్త్రంగా వాడుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏడుకొండలవాడు తగిన శిక్ష వేస్తారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు చేసిన పొరపాట్లకు ఆ స్వామి శాంపిల్ చూపించారని, నేడు లడ్డూ ప్రసాదాన్ని కించపరిచేలా భక్తుల మనోభావాలను పణంగా పెట్టినందుకు మరోమారు తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరించారు. లడ్డూలో వాడే నెయ్యిని కేంద్రం ఆధ్వర్యంలోని మైసూర్‌లో ల్యాబ్‌కు పంపకుండా.. గుజరాత్‌లోని ప్రైవేటు ల్యాబ్‌లకు పంపారని, రిపోర్టును సైతం రెండున్నర నెలలు తొక్కిపెట్టారని విమర్శించారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నెయ్యి ట్యాంకర్లను 15 సార్లు వెనక్కి పంపిస్తే జగన్ హయాంలో 18 సార్లు వెనక్కి పంపించారని గుర్తుచేశారు. కల్తీ విషయంలో చంద్రబాబు, లోకేష్ పొంతన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా 100 రోజుల పరిపాలనను పక్కదారి పట్టించేందుకు లడ్డూ ప్రసాదాన్ని వాడుకున్నారని విమర్శించారు.



పెనుగొండ : వాసవీ మాత ఆలయం వద్ద పూజలు చేయించిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఉండి : వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

న్యూస్‌రీల్

పీఎంశ్రీ నిధులతో మౌలిక వసతులు



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: పీఎంశ్రీ యోజన పథకం నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు మెరుగైన బోధన అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం భీమవరం కలెక్టరేట్‌లో పీఎంశ్రీ యోజనపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతల్లో 25 పాఠశాలలను ఎంపిక చేయగా వీటిని పీఎంశ్రీ స్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్టు చెప్పారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.6 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశామన్నారు. పథకం లక్ష్యాల నూరు శాతం సాధించేందుకు కృషిచేయాలని హెచ్‌ఎంలకు ఆదేశించారు. ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ పి.శ్యాంసుందర్, డీఈఓ కార్యాలయం ఏడీ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ అధికారి గణపతిరావు, ఏఎంఓ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

డీపీఓగా అరుణశ్రీ



బాధ్యతలు స్వీకరిస్తున్న అరుణశ్రీ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా బి.అరుణశ్రీ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు డీపీఓగా పనిచేసిన ఆర్.విక్టర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో విజయనగరం జిల్లా డ్వామా అడిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అరుణశ్రీని ఇక్కడ డీపీఓగా నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆమె కలెక్టర్ నాగరాణిని మర్యాద పూర్వకంగా కలిశారు.

గూడెం విద్యుత్ ఈఈగా నరసింహమూర్తి



ఈఈకు శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈగా కె.నరసింహమూర్తి శనివారం జువ్వలపాలెంలోని ఈఈ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. విజయవాడ రూరల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు భీమవరం ఈఈగా వెళ్లారు. నరసింహమూర్తికి విద్యుత్ 327 యూనియన్ నాయకులు కృష్ణంరాజు, ఏడీఈలు, ఏఈలు, వీఈఓ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చండి


భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమంలో భాగంగా భీమవరం పట్టణానికి సంబంధించి విస్సాకోడేరు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో శనివారం ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 2,558 ఇళ్లు రూఫ్ దశలో ఉన్నాయని, డిసెంబర్ నాటికి లబ్ధిదారులు వాటిని పూర్తి చేయాలన్నారు. అలాగే వివిధ దశల్లో ఉన్న 18,097 ఇళ్లను వచ్చే మార్చిలోపు పూర్తిచేయాలని లేకుంటే కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగిపోతాయన్నారు. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచామన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడారు. హౌసింగ్ ఈఈ బి.వెంకటరమణ, ఏఈ సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాకు బదిలీపై వచ్చిన పలు శాఖల అధికారులు శనివారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. భీమవరం ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, డీపీఓ అనుశ్రీ, ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ ఎ.రఘునాథ్‌బాబు, డీఈ వెంకటేశ్వరరావు, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి అప్పారావు, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి రవిప్రసాద్ కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

13 నుంచి చిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

17న తిరుకల్యాణం.. 18న రథోత్సవం



ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో చిన వెంకన్న ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 13 నుంచి 20 వరకు వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి శనివారం తెలిపారు. వైఖానస ఆగమాన్ని అనుసరించి పాంచాహ్నిక దీక్షతో ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో శ్రీవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామోత్సవాలు జరుపుతామన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు.

ఉత్సవాలు ఇలా..
- 13న ఉదయం శ్రీవారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలు ముస్తాబు చేయడంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. రాత్రి 7 గంటలకు గజ వాహనంపై గ్రామోత్సవం.
- 14న రాత్రి ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు హంస వాహనంపై గ్రామోత్సవం.
- 16న ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటల నుంచి ఎదుర్కోలు ఉత్సవం.
- 17న రాత్రి 8 గంటల నుంచి శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం.
- 18 న రాత్రి 7 గంటల నుంచి రథోత్సవం.
- 19న ఉదయం 7 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణ.
- 20న ఉదయం 9 గంటలకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పవళింపుసేవ, శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఏఈఓ రమేష్‌బాబు ద్వారకాతిరుమలకు బదిలీ

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఏఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్.రమేష్‌బాబును ద్వారకాతిరుమలకు బదిలీ చేస్తూ దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఆలయంలో ఐదుగురు ఏఈఓలు విధులు నిర్వహిస్తుండగా దసరా ఉత్సవాలకు నాలుగు రోజుల ముందుగా ఇద్దరు ఏఈఓల్ని బదిలీ కావడం దుర్గగుడిలో చర్చనీయాంశంగా మారాయి.

30న రౌండ్ టేబుల్ సమావేశం

భీమవరం: మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు వైఖరిని ఖండిస్తూ ఈనెల 30న కేవీపీఎస్ ఆధ్వర్యంలో భీమవరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు తెలిపారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఏలూరుపాడులో జరిగిన ఫ్లెక్సీ వివాదానికి మత విశ్వాసాలను జోడించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేడ్కర్ ఫొటోతో ఉన్న బ్యానర్‌ను స్వయంగా ఎమ్మెల్యే తొలగించడం అన్యాయమన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు భీమవరం లాంచీల రేవు వద్ద నిర్వహించే జిల్లాస్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ పాల్గొంటారన్నారు.

పశు వైద్యశాల పరిశీలన



ప్రహరీ నిర్మాణం కోసం పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

పాలకొల్లు సెంట్రల్: 'శిథిలావస్థలో ప్రభుత్వ పశు వైద్యశాల' శీర్షికన శనివారం 'సాక్షి'లో వచ్చిన కథనంపై పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ పాలకొల్లు పశు వైద్యశాల భవనాన్ని నిర్మించి 52 ఏళ్లు పూర్తయిందని, భవనం శిథిలావస్థకు చేరడంపై వచ్చిన కథనానికి స్పందించి నూతన భవనం నిర్మాణం, మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. అలాగే డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా మున్సిపల్ అధికారులు తొలగించిన ప్రహరీ నిర్మాణం నిమిత్తం మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథిని కలిసి మాట్లాడామన్నారు. వెంటనే మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పశు వైద్యశాఖలో ప్రహరీ నిర్మాణం కోసం అంచనాలు తయారీకి వచ్చారన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే ఆస్పత్రి భవనం పునర్నిర్మిస్తామని చెప్పారు. పశుసంవర్ధక శాక సహాయ సంచాలకుడు జి.మల్లేశ్వరరావు, డీఈ రాజ్‌కుమార్, ఏఈ సాంబశివుడు ఉన్నారు.

క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కలెక్టర్


హౌసింగ్ బోర్డు వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామిని కలెక్టర్ చదలవాడ నాగరాణి తల్లిదండ్రులతో కలిసి దర్శించుకున్నారు. ముందుగా కలెక్టర్‌కు ఆలయ కమిటీ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికింది. కలెక్టర్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నడింపల్లి బంగార్రాజు ఆలయానికి రూ.5 లక్షల విలువ కలిగిన పుంగనూరు జాతి ఆవు, దూడను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, సెక్రటరీ కుక్కల బాల తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డులివ్వాలి


మాట్లాడుతున్న ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దిగుపాటి రాజగోపాల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): న్యాయవాదులకు ఉచిత హెల్త్ కార్డులివ్వాలని ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో వి.శైలజ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ ఏపీలో వివిధ కోర్టులలో సుమారు 50 వేల మంది న్యాయవాదులు ఉన్నారని, వారికి హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం క్రిమినల్ చట్టాలలో మార్పు చేస్తూ తీసుకొచ్చిన చట్టాలు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

ఏలూరు మెడికల్ కాలేజీ విద్యార్థుల హవా

- ఫస్టియర్ ఎంబీబీఎస్ అనాటమీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్
- మొదటి ఏడాదిలోనే సత్తా చాటిన విద్యార్థులు


ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనం (ఫైల్)

ఏలూరు టౌన్ : ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు మొదటి ఏడాది ఎంబీబీఎస్ పరీక్షల్లో సత్తా చాటారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రతిష్టాత్మకంగా ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయగా.. మొదటి ఏడాది వైద్య విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. అనాటమీ సబ్జెక్టులో ఏకంగా రాష్ట్రస్థాయిలో మొదటి పది ర్యాంకుల్లో నాలుగు స్థానాలు కైవసం చేసుకున్నారు. నిపుణులైన ప్రొఫెసర్లు, అధ్యాపకులతో వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటంలో ఏలూరు వైద్య కళాశాల హెచ్‌వోడీలు, అధ్యాపక బృందం అవిరళ కృషి చేశారు.

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 2023 సెప్టెంబర్ 2న మొదటి ఏడాది ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 150 మంది వైద్య విద్యార్థులు చేరగా అత్యుత్తమ విద్యాబోధనతో మొదటి ఏడాది పరీక్షల్లో తమ ప్రతిభ చాటుకున్నారు.

ఎంబీబీఎస్ అనాటమీ సబ్జెక్టులో రాష్ట్ర స్థాయి మొదటి 10 ర్యాంకుల్లో నాలుగు ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు సాధించటం విశేషం. మద్దుల సాయి నాగవెంకట్ అనాటమీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో(254 మార్కులతో) మొదటి ర్యాంకు, బడిన కోటేశ్వరి (249 మార్కులతో) 3వ ర్యాంకు, కే.అష్మి (247) 6వ ర్యాంకు, పైడి హేమలత (244) 9వ ర్యాంకు సాధించారు. . ఏడుగురు విద్యార్థులు డిస్టింక్షన్‌లో, 92 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్, 32 మంది విద్యార్థులు సెకండ్ క్లాస్ సాధించారు. ఏలూరు వైద్య కళాశాలలో మొత్తంగా 90 శాతం ఉత్తీర్ణత సాధించారని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ చెప్పారు.

ఉత్తమ వైద్య సేవలందిస్తా



మొదటి ఏడాది పరీక్షల్లో అనాటమీలో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. పీజీ పూర్తి చేసిన అనంతరం మన సొంత గ్రామం, రాష్ట్రంలోనే ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలనే కోరిక ఉంది. వైద్యుడిగా మా కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

– మద్దుల సాయినాగవెంకట్, వైద్య విద్యార్థి

గైనకాలజిస్టు కావడం లక్ష్యం



నేను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను. అనాటమీలో రాష్ట్ర స్థాయి 3వ ర్యాంకు సాధించటం ఎంతో ఆనందంగా ఉంది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన అనంతరం వైద్య విద్యలో పీజీ పూర్తి చేయాలని నా లక్ష్యం. గైనకాలజిస్ట్‌గా మహిళలకు సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా.

– బాడిన కోటేశ్వరి, వైద్య విద్యార్థిని

వైద్యురాలిగా పేరు తెచ్చుకోవాలి



ఆలిండియా కోటాలో ఏలూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించాను. మాది కేరళ. ఏలూరు వచ్చాక తెలుగు నేర్చుకుంటున్నా. మొదటి ఏడాది పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు తెచ్చుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– కే అష్మి, వైద్య విద్యార్థిని

కాలేజీలో సౌకర్యాలు బాగున్నాయి



మా కుటుంబంలో, బంధువుల్లో మొదటి వైద్యురాలిని. ఫస్టియర్ ఎంబీబీఎస్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు రావటం సంతోషంగా ఉంది. వైద్యురాలిగా స్థిరపడి అందరికీ సేవ చేయాలనే ఆశయంతో చదువుతున్నాను. ఈ కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

– పైడి హేమలత, వైద్యవిద్యార్థిని

కష్టానికి తగ్గ ఫలితం



ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేసిన మొదటి ఏడాదిలోనే మా వైద్య విద్యార్థులు కష్టపడి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రతిభను ప్రదర్శించారు. హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బోధనతోపాటు, విద్యార్థుల కష్టానికి తగిన ఫలితాలు వచ్చాయి.

– డాక్టర్ ఎం.శశిధర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, ఏలూరు

నల్లి రాజేష్ గృహ నిర్బంధం

పాలకొల్లు అర్బన్ : ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణం అరెస్ట్ చేయాలని కోరుతూ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ శనివారం వీరవాసరంలో చేపట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. పట్టణ సీఐ కోలా రజనీకుమార్, పోలీసులు రాజేష్‌ను పాలకొల్లులో గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను భారతదేశం దేవుడిలా పూజిస్తుంటే అధికార దాహంతో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఫ్లెక్సీని చించివేసి అధికార దర్పాన్ని ప్రదర్శించారని విమర్శించారు. అంబేడ్కర్ ఫ్లెక్సీని చించడమంటే అంబేడ్కర్‌ను, భారత రాజ్యాంగాన్ని అవమానించినట్లేనని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్, నాయకులు పొనుకుమట్ల వీరాస్వామి, పాలపర్తి కృపానాథ్, నల్లి జయరాజు, మట్టా చంద్రశేఖర్, పెనుమాల బోసు, బత్తుల భూపతి, సబితి పద్మారావు, కార్యకర్తలను అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు.


పాలకొల్లులో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్‌ను గృహ నిర్బంధం చేసిన సీఐ కోలా రజనీకుమార్

కాకిలేటి మధు హౌస్ అరెస్టు

నరసాపురం రూరల్: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీలు లాగేసి అవమానించినందుకు నిరసన తెలుపుతున్న నేతలను హౌస్ అరెస్టు చేయడం తగదని మాల మహానాడు నరసాపురం డివిజన్ అధ్యక్షుడు, నియోజకవర్గ మాలల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి కాకిలేటి ఆనందకుమార్ (మధు) అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ముట్టడికి దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. దీంతో పోలీసులు ఎక్కడికక్కడ సంఘ నాయకులను గృహనిర్బంధం చేశారు. మాల మహానాడు నరసాపురం డివిజన్ అధ్యక్షుడు కాకిలేటి ఆనందకుమార్(మధు)ను శనివారం ఉదయం నరసాపురం మండలంలోని చిట్టవరంలోని ఆయన ఇంటి వద్ద గృహనిర్బంధం చేశారు. రఘురామకృష్ణరాజుకు త్వరలోనే దళిత సంఘాలు తగిన గుణపాఠం చెబుతాయని మధు పేర్కొన్నారు.


కాకిలేటి ఆనందకుమార్‌ను చిట్టవరంలో హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

ఫ్లెక్సీల చించివేతపై భగ్గుమన్న కౌన్సిల్

నరసాపురం : పట్టణంలో అన్న క్యాంటీన్ ప్రారంభం సందర్భంగా చైర్‌పర్సన్, స్థానిక కౌన్సిలర్ ఫ్లెక్సీలు చించివేతపై నరసాపురం కౌన్సిల్ రసాభాసగా ముగిసింది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మధ్యాహ్నం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన జరిగింది. వైస్సార్‌సీపీ కౌన్సిలర్ సిర్రా కాంతమ్మ మాట్లాడుతూ ఇటీవల అన్న క్యాంటీన్ ప్రారంభం సందర్భంగా చైర్‌పర్సన్, స్థానిక కౌన్సిలర్ ఫ్లెక్సీలు చింపడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, 30వ వార్డు కౌన్సిలర్ అడిదల శ్యామల జనసేన, టీడీపీ కౌన్సిలర్లతో వాగ్వివాదానికి దిగారు. తమపై చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. అన్న క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల ఫ్లెక్సీలు చింపేసిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారని కమిషనర్‌ను ప్రశ్నించారు. వారిపై పోలీసు కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ పోడియం వద్ద వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు బైఠాయించి ఆందోళన చేశారు. స్వతంత్ర అభ్యర్థి కోటిపల్లి సురేష్, టీడీపీ సభ్యుడు పాలూరి బాబ్జిలు అడ్డుతగలగా, అడిదల శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ కేసు పెట్టాలని, హామీ ఇచ్చే వరకూ సమావేశం జరగనివ్వమన్నారు. బీసీ, మహిళా కౌన్సిలర్లు, దళిత మహిళా కౌన్సిలర్లు అని చూడకుండా అవమానిస్తారా? అని కామన నాగిని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఫ్లెక్సీలు చింపిన వారిపై కేసు పెడతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆందోళన విరమించారు. రెండు గంటల ఆందోళన తరువాత సమావేశం ప్రారంభమైంది. టెండర్లు పూర్తి చేసినా పనులు ఎందుకు మొదలు పెట్టడంలేదని సభ్యులు ప్రశ్నించారు. అయితే సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ ప్రకటించారు.


చైర్‌పర్సన్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా కౌన్సిలర్లు

ఆన్‌లైన్‌లో కేసుల దాఖలుపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జిల్లా జడ్జి మంగాకుమారి


ఏలూరు (ఆర్ఆర్‌పేట): కక్షిదారులకు మరింత వేగవంతమైన, నాణ్యమైన న్యాయ సేవలు అందించడం కోసం ఆన్‌లైన్ విధానం ద్వారా కేసుల దాఖలుకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి జిల్లా జడ్జి పీ మంగాకుమారి తెలిపారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం శనివారం న్యాయ సేవాధికార సంస్థ భవనంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలకు ఆన్‌లైన్ విధానం ద్వారా కేసుల దాఖలు ప్రక్రియపై శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా కక్షిదారులకు న్యాయ సేవలు మరింత చేరువవుతాయన్నారు. ఈ ఫైలింగ్ ద్వారా కేసులను ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవడం, కేసుల విచారణ, వాయిదాలు నేరుగా ఎస్ఎంఎస్ ద్వారా కక్షిదారులకు చేరుకోవడానికి మరింత ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లి కృష్ణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్ ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్


పెదవేగి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్లు

పెదవేగి : తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేశామని పెదవేగి ఇన్‌చార్జి తహసీల్దార్ భ్రమరాంబ తెలిపారు. పెదవేగి మండలం విజయరాయి, నడిపల్లి, జానంపేట గ్రామాలకు చెందిన వ్యక్తులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ట్రాక్టర్లను సీజ్ చేశారు. పెదవేగి మండలంలో తమ్మిలేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న 5 ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి సీజ్ చేశారు.

ట్రిపుల్ ఐటీ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డీన్‌గా శ్యామ్



నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పి.శ్యామ్ ఆర్జీయూకేటీ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇంక్యుబేషన్ డీన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాళ్లకూరు వెంకన్నకు జలాభిషేకం


కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సప్త నదులతో జలాభిషేకం చేస్తున్న దృశ్యాలు

కాళ్ల : కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామికి సప్త నదుల జలాలతో వేద పండితుల వేదమంత్రాల నడుమ జలాభిషేక మహోత్సవాలు వైభవపేతంగా నిర్వహించారు. కాళ్ళకూరులో వేంచేసిన స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కనుల పండువగా స్వామికి సప్త నదుల జలాలతో అభిషేకం జరిపారు. సప్తనది జలాభిషేక పవిత్రోత్సవాల్లో భాగంగా గత నాలుగు రోజులుగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శనివారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేకాలంకరణలో ఉన్న స్వామి అమ్మవార్లకు సప్తనదులైన గోదావరి, సరస్వతి, యమునా, గంగా, కృష్ణ ,కావేరి, నర్మద నదుల నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలతో అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక హోమం నిర్వహించారు. ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సప్త నదీ జలాలు, పవిత్రాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి అష్టోత్తర కలశార్చన చేశారు. అనంతరం శాంతి కల్యాణ మహోత్సవం అష్టోత్తర పూజలు చేశారు. ఆలయం వద్ద స్వామిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తుల బారులు తీరారు. కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

1న హ్యాండ్ రోల్‌బాల్ జట్ల ఎంపికలు

వీరవాసరం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 బాలబాలికల రోల్‌బాల్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్ల ఎంపికలు అక్టోబర్ 1న తణుకు మున్సిపల్ పార్క్‌లో జరుగుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి మల్లేశ్వరరావు తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత

ఇరగవరం: రేలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ క్రీడాపోటీల్లో సత్తా చాటి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధ పడుతున్నారు. వీరికి ఇదే పాఠశాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు, 1988–89 పదో తరగతి బ్యాచ్ వారు క్రీడా దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.రవీంద్ర, వ్యాయామ ఉపాధ్యాయురాలు వి.సుమలత, ఉపాధ్యాయులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పోషకాహార మహోత్సవాలు శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. 60 అంగన్‌వాడీ సెంటర్లకు సంబంధించి వీకర్స్‌కాలనీలో జరిగిన మహోత్సవాలకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరైయారు. సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. మిషన్ వాత్సల్య పథకంలో తల్లి లేదా తండ్రి చనిపోయిన పిల్లలకు నెలకు రూ.4 వేలు చొప్పున నగదు అందజేశారు. సీడీపీఓ డీఎల్ సరస్వతి, మునిసిపల్ కమిషనర్ యేసుబాబు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, మెప్మా అధికారులు, సూపర్‌వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

పెంటపాడు: ప్రాణాంతకమైన రాబిస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డివిజన్ పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. పెంటపాడు పశువుల ఆసుపత్రి వద్ద మండల పశువైద్యాధికారి మహేష్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కల యజమానులకు ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. డివిజన్‌లోని అన్ని పశువైద్య కేంద్రాల్లో రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

అత్తిలి: ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా అత్తిలి ప్రాంతీయ పశు వైద్యశాలలో శనివారం పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాల వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ హాజరై మాట్లాడారు. పెంపుడు, వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు పశుసంవర్ధకశాఖ తరపున అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద, వెటర్నరీ డిస్పెన్సరీలు, గ్రామీణ పశువైద్యశాలల వద్ద ఉచితంగా వేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా అత్తిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రేబిస్ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ నరశింహారావు విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా 32 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు.

నిత్యావసరాల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్ అగ్రహారం ఇందిరా కాలనీలోని వల్లీ మోహన్ యువజన సేవా సమితి కార్యాలయంలో నలుగురు వృద్ధులకు శనివారం 20 కిలోలు చొప్పున బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పటాన్ వలీ మాట్లాడుతూ యడవల్లి సుబ్బరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మధు సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గౌరవాధ్యక్షుడు అడపా తిలక్, అధ్యక్షుడు ఉండ్రాజవరపు భాస్కరరావు, కార్యదర్శి గొల్లేరు మోహన్, కోశాధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్లో స్వచ్ఛతా హీ సేవ

తాడేపల్లిగూడెం (టీఓసీ): గెయిల్ ఇండియా లిమిటెడ్ (రాజమండ్రి) వారి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. చెత్త చెదారాలు తొలగించారు. పరిశుభ్రత పాటించారు. గెయిల్ సెక్యూర్టీ సూపర్‌వైజర్ ఊడిమూడి రాజు సెక్యూరిటీ సిబ్బంది, ఎన్‌సీసీ ఆఫీసర్ గణపతిరావు, ఎన్‌సీసీ క్యాడట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పందుల సమస్యను పరిష్కరిస్తాం

తణుకు అర్బన్: సజ్జాపురంలో పందుల స్వైరవిహారం శీర్షికన శనివారం సాక్షిలో వచ్చిన కథనానికి పశువైద్య శాఖ, మునిసిపల్ అధికారులు స్పందించారు. సజ్జాపురంలో సంచరిస్తున్న పందులకు సంబంధించి పెంపకందారులను హెచ్చరించడమే కాకుండా ఊరికి దూరంగా ఉంచేలా ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ తణుకు ఉపసంచాలకులు డాక్టర్ వాకాణి ప్రసాద్, మునిసిపల్ శానిటరీ ఇనస్పెక్టర్ గోవిందయ్య తెలిపారు.

మహిళా కళాశాల విద్యార్థి సంఘం ఎన్నిక

తణుకు టౌన్: తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినీ సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్స్ కెప్టెన్ యూ లక్ష్మీసుందరిబాయి, బీహెచ్ హిమబిందు తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన విద్యార్థి సంఘం ఎన్నికలలో డిగ్రీ విభాగంలో చైర్‌పర్సన్లుగా వి.జ్యోతి, కేసీహెచ్ నాగలక్ష్మీ, తేజస్వి అఖిల, వైస్ చైర్‌పర్సన్‌గా జీ భావన, కార్యదర్శిగా పీ వైష్ణవి ఎన్నికైనట్లు తెలిపారు. ఇంటర్ విభాగంలో చైర్‌పర్సన్‌గా ఎస్ రమ్యకుమారి, వైస్ చైర్‌పర్సన్‌గా పీ కుమారి, కార్యదర్శిగా జీ నయోమీ, సహాయ కార్యదర్శిగా జీ రజిత, కల్చరల్ కార్యదర్శిగా కె భవ్యశ్రీ, జనరల్ కెప్టెన్‌గా డీ తేజ ఎన్నికైనట్లు తెలిపారు. కళాశాల విద్యార్థి సంఘానికి నూతనంగా ఎన్నికైన విద్యార్థినులను అధ్యాపకులు అభినందించారు.

ఆధారాలు లేని ఆరోపణలు తగవు

- మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు
- వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



తణుకులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌లను ఆశీర్వదిస్తున్న అర్చకులు



తాడేపల్లిగూడెంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఇరగవరంలో ప్రక్షాళన పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అత్తిలిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మండపాక కేశవ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తణుకు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి మంచి బుద్ధి ప్రసాదించమని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, పార్టీ శ్రేణులతో కలిసి ఆలయ ఆవరణలో మూడు ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయంలో కొలువుతీరిన స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై ఎటువంటి ఆధారాలూ లేకుండా భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆరోపణలు చేయడం బాధాకరమని మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ అన్నారు. లడ్డూ ప్రసాదంపై చేసిన ఆరోపణలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులను ఎంతో బాధించాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, వి.సీతారాం, జల్లూరి జగదీష్, పైబోయిన ఏసుబాబు, మారిశెట్టి శేషగిరి, కొమ్మోజు రామకృష్ణ, గెద్దా శ్రీకాంత్, పుల్లెపు సూర్యచంద్రరావు, గుబ్బల సూర్యచంద్రరావు, బొల్లా దుర్గాప్రసాద్, చింతలపూడి సూర్యనారాయణ, పైబోయిన సాయితేజ, ఝాన్సీ లారెన్స్, షేక్ జిలానీ, ఎం.లలిత, టీపీ నాగిరెడ్డి, దున్నా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలి

తణుకు టౌన్: కలియుగ దైవం తిరుమల తిరుపతి పవిత్రతను దెబ్బతీస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు వివిధ దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. శనివారం తణుకు రూరల్ మండలంలోని మండపాకలోని కేశవ స్వామి ఆలయంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల సన్యాసిరావు, సొసైటీ మాజీ అధ్యక్షురాలు వై విజయామూర్తి, తదితర నాయకులు పాల్గొన్నారు. తణుకు మండలం తేతలిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కోరుతూ పూజలు చేశారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోట స్వామిజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, దారం శ్రీను పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

ఇరగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆలయాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ ఆలయాల్లో పూజలు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎంపీటీసీలు సుధాకర్ రెడ్డి, పాలా పాలేశ్వరరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు చవకుల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మామిడిశెట్టి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుడిపూడి నాగ వెంకటసత్యనారాయణ, సత్తి వెంకట రెడ్డి, పెన్మెత్స సుబ్బరాజు, కటరి రాంబాబు, వీరవల్లి త్రిమూర్తులు, కడలి విజయ్ కుమార్, పెచ్చెటి పెద స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో..

అత్తిలి: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం ప్రత్యేక పూజలు చేసి, చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నారు.వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, నాయకులు రంభ సూరిబాబు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, కంకటాల సతీష్, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, గారపాటి నాగరాజు, యడ్లపల్లి మణికుమార్, దుడే ఉమ, కముజు శ్రీను, బుంగా పద్మారావు, దిరిశాల నాగబాబు, కాపెల్లె వెంకటేశ్వరరావు, అనిశెట్టి త్రిమూర్తులు, రాంపండు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలి మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రమైన లడ్డూ ప్రసాదంపై వచ్చిన ఆరోపణలకు నిరసనగా మాజీ ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో పాదయాత్రగా వెళ్లి ప్రక్షాళన పూజలు శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ప్రజలకు విశ్వాసమైన పాలన అందించేందుకు చంద్రబాబుకు బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నట్లు కొట్టు చెప్పారు. జరిగిన అపరాదానికి చంద్రబాబును మన్నించాలని స్వామివారిని కోరానన్నారు. రాష్ట్ర ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమాన్ని అందించాలన్నారు. వందరోజుల విఫలమైన పాలనను మంచి ప్రభుత్వమని స్టిక్కర్లు అంటించుకోవడం హేయమని తెలిపారు. అమరావతి రాజధాని అనువుగాని ప్రదేశంలో ఉందని, సాంకేతిక వర్గాలు చెప్పినా పెడచెవిని పెట్టి ముంపు ప్రాంతంలోనే రాజధాని నిర్మించడం చంద్రబాబు అవివేకానికి తార్కాణమని అన్నారు. వరద బాధితులకు ఆహారం, తదితర సౌకర్యాలు అందించడంలో విఫలమయ్యాడని చంద్రబాబుపై మండిపడ్డారు. వందరోజుల్లో ప్రజలకు ఏమీ చేయలేదని అపవాదు రాకూడదనే భయంతో భగవంతుడిపై అపవాదులు వేయడం చంద్రబాబు నీచత్వానికి నిదర్శనమన్నారు. తిరుమలలో ఏ వస్తువులను పరిశోధించకుండా వినియోగించరని, నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్ ఉందని రిపోర్టును దేవస్థానం ఈఓ శ్యామలరావు స్పష్టం చేశారన్నారు. కార్యక్రమంలో ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు, గుండుమోగుల సాంబయ్య, చామన సూర్యచంద్రరావు, సూర్పణి రామకృష్ణ, రెడ్డి సూరిబాబు, బోశం రమణ, కైగాల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

తణుకు టౌన్: ప్రభుత్వ వసతి గృహాలు (హాస్టళ్ల)లో చదివే విద్యార్థినీ, విద్యార్థులపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి, న్యాయ సేవా సంస్థ చైర్మన్ డి సత్యవతి సిబ్బందిని ఆదేశించారు. శనివారం తణుకులోని వివిధ ప్రభుత్వ హాస్టళ్లను ఆమె సందర్శించి, వాటి పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆము మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతగా ఉండాలని కోరారు. తణుకులోని సాల్వేషన్ ఆర్మీ ఆధ్వర్యంలోని బాలికల హాస్టల్, ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్, ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్, ఎస్సీ బాలికల హాస్టల్, ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్, 1, 2, బీసీ బాలికల కళాశాల హాస్టల్, బీసీ బాలుర కళాశాల హాస్టళ్లలోని పరిస్థితులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అజయ్‌కుమార్, సత్యనారాయణరాజు, హాస్టల్స్ వార్డెన్లు పాల్గొన్నారు.



హాస్టల్లో విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా 4వ అదనపు జడ్జి డి.సత్యవతి

రాష్ట్రస్థాయి పోటీలకు మండపాక విద్యార్థుల ఎంపిక

తణుకు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తణుకులోని బెల్ వెదర్ స్కూల్లో నిర్వహించిన మోడరన్ పెంటథలాన్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో తణుకు రూరల్ మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఆర్.మోహన్ బాబు తెలిపారు. ఈపోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఎస్ గణేష్, బి భార్గవ్, జీ తేజా రత్నం విజేతలుగా నిలిచారని తెలిపారు. వీరు శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టులో ఆడతారని తెలిపారు.

సాఫ్ట్ టెన్నిస్‌లో ఇద్దరు ఎంపిక

శనివారం జిల్లాలోని గణపవరంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో తణుకు మండలం మండపాక జిల్లా పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన జీ వరప్రసాద్, పీ అశోక్ జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచి కడపలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గ్రామానికి చెందిన నాయకుడు ఆత్మకూరి రామకృష్ణ విద్యార్థులను ప్రోత్సహిస్తూ రూ.10 వేల నగదు బహుమతిగా అందజేసినట్లు తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులు అభినందించారు. ఈసందర్భంగా పీఈటీ సంకు సూర్యనారాయణను సర్పంచ్ జానా వెంకటలక్ష్మి, నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, పి.భాస్కరరావు, ఆలపాటి శివరావు, ఎస్ఎంసీ చైర్మన్ జీ మహాలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

హాస్టళ్లను పరిశీలించిన జడ్జి సూర్యకిరణ్‌శ్రీ

పెంటపాడు: గూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎస్ సూర్యకిరణ్‌శ్రీ శనివారం పెంటపాడు మండలంలోని పలు ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించారు. గూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 2వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా సూచనల మేరకు పెంటపాడులోని ఎస్సీ బాల, బాలికల ప్రభుత్వ వసతి గృహాలను, పరిమెళ్లలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. సూర్యకిరణ్‌శ్రీ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతులు, ఆహారం, వంటగది, వస్త్రాలను పరిశీలించారు. ఆయా వార్డెన్లకు తగు సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలని ఆకాంక్షించారు. పెంటపాడు మండల హాస్టల్ వెల్ఫేర్ అధికారులు రామలింగం, రామకృష్ణ, అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో దండగర్ర విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభకనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. యోగలో చెరుకు వడ్డికాసులు, పసుపులేటి రాజేష్, రాపాక వినయ్‌కుమార్, దండే మమ, మైనం దుర్గా వెంకట కోట లక్ష్మి, అర్జుల మానస, కబడ్డీలో ఊబా వెంకటేష్, ఉసురుమర్తి ధనుష్, నిట్టా కార్తీక్, దండే మమ, మైనం దుర్గా వెంకటకోట లక్ష్మి,మైనం మాధురి, పుష్పలత, బత్తుల పందులు ఎంపికైనట్లు చెప్పారు. వీరిని సర్పంచ్ పిల్లా రాంబాబు, హెచ్ఎం సీహెచ్ చంద్రశేఖర్, వ్యాయమోపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.



జిల్లా పోటీలకు ఎంపికైన దండగర్ర విద్యార్థులు


జోషిని పరామర్శించిన మాజీ మంత్రి కారుమూరి

ఇరగవరం: ఏలేటిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకలు చోడే జోషిని మాజీ మంత్రి, తణుకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ కారుమూరి వెంకటనాగేశ్వరరావు శనివారం పరామర్శిచారు. ఇటీవల చోడే జోషి అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కారుమూరి ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు కారుమూరి తెలిపారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చినా అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దినేష్ రెడ్డి మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు, కటారి రాంబాబు, పెన్మెత్స సుబ్బరాజు, సర్పంచ్ రామాయణం జగదీష్, చింతా బాపి రెడ్డి, ఎంపీటీసీ దొమ్మేటి శ్రీనివాస్, ఉప్పులూరి జితేంద్ర, కోళ్ల సూరిబాబు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన సెక్రటరీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పురపాలక సంఘంలో నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన మునిసిపల్ కమిషనర్ ఎం ఏసుబాబును పట్టణంలోని సచివాలయం సెక్రటరీలు కలిసి అభినందనలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ నిమిత్తం కమిషనర్‌కు మొక్కను అందించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించాలని సచివాలయ కార్యదర్శులకు సూచించారు.

జీఎంఆర్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు



జీఎంఆర్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు పాల్గొన్న యాజమాన్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ వాసవిలో జీఎంఆర్ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు సాదరంగా ఆహ్వానించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎస్ సూర్యనారాయణ మూర్తి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎన్ శ్రీనివాస్‌లు మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, సమయాన్ని వృథా చేసుకోవద్దని, నైపుణ్యాలను మెరుగుపర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శం

తణుకు టౌన్: దేశ స్వాతంత్ర్యం పోరాటంలో తన జీవితాన్ని త్యాగం చేసిన విప్లవవీరుడు భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శం కావాలని సీపీఎం కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు కోరారు. శనివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా తణుకు మండలం వేల్పూరు సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్‌సింగ్ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబటి రామకృష్ణ, వాసా వెంకటేశ్వరరావు, వాటాల నాగేశ్వరరావు పాల్గొన్నారు. సర్దార్ భగత్‌సింగ్ 117వ జయంతిని తణుకు బ్యాంక్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శనివారం బ్యాంక్ కాలనీలో అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర్ చౌదరి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం (టీఓసీ) / తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ కార్యకర్త, ఏడు సహాయకురాలి పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు తాడేపల్లిగూడెం పట్టణంలోని రెండో వార్డు (ఓసీ), పెంటపాడు మండలం ఆకుతీగపాడు-1 (ఎస్సీ), అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులు నవాబుపాలెం-2 (ఓసీ), గణపవరం మండలం మొయ్యేరు (బీసీ–ఈ), తాడేపల్లిగూడెం పట్టణంలోని 13వ వార్డు (ఓసీ), 10వ వార్డు ఓసీ, తాడేపల్లిగూడెం మండలంలోని కొమ్ముగూడెం-1 ఎస్సీ, కొమ్ముగూడెం-3 ఓసీ, నీలాద్రిపురం ఓసీలకు రిజర్వు అయినట్టు తెలిపారు. మహిళలు స్థానికులు కావడంతో పాటు 10వ తరగతి పాసై 2024 జులై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు గల వారు అర్హులుగా పేర్కొన్నారు. వికలాంగులైతే తక్కువ స్థాయి అంగవైకల్యం కలిగి ఉండాలని తెలిపారు. అక్టోబరు 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి చేసిన దరఖాస్తులను పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

సామాజిక విప్లవకారుడు జ్యోతిబాపూలే

తాడేపల్లిగూడెం (టీఓసీ): జ్యోతిబాపూలే సమాజంలోని సాంఘీక అసమానుతులకు వ్యతిరేకంగా కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల అభ్యున్నతికి 152 సంవత్సరాల క్రితమే కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. జ్యోతిబాపూలే సత్యశోధక సమాజ్ 152వ సంవత్సరం సందర్భంగా స్థానిక శేషమహల్ సెంటర్‌లో శనివారం సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి న్యూడెమోక్రసీ నాయకులు మామిడి దాన వర ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్రంలో మోదీ, అమిత్‌షా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని, బాధితులను చంపేస్తున్నారని వాపోయారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. బి.ఉదయరాజు, రాము, అసిన్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, నవీన్, రామకృష్ణ, సుబ్బారావు, నాని తదితరులు పాల్గొన్నారు.

కవి జాషువాకు ఘన నివాళి

తాడేపల్లిగూడెం అర్బన్: సమాజ స్పృహ ఉన్న కవి గుర్రం జాషువా అని పలువురు వక్తలు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి. హరికుమార్ అధ్యక్షతన కవి గుర్రం జాషువా 126వ జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. జాషువా కవితలను నేటియువత పఠనం చేయాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో వైపీఎస్ ముత్యాగర్, కె వెంకటేశ్వరరావు, ఓ కృష్ణకుమారి, తాడేపల్లి మోహనరావు తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పెంటపాడు: దళిత చైతన్యం జాషువా కవిత్వం ద్వారా సాధ్యమైందని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.వాణి పేర్కొన్నారు. కవికోకిల గుర్రం జాషువా జయంతి కార్యక్రమం శనివారం పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. జాషువా సాహిత్యంపై పలువురు మాట్లాడారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు శాఖాధిపతి ఎం సుంకరగోపాల్, విడతల రామచంద్రుడు, అధ్యాపకులు జాన్‌బాబు, ప్రేమ్‌సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధునాతన ఆక్సీకరణ ప్రక్రియలపై ఉపన్యాసం

తాడేపల్లిగూడెం: ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం రసాయన శాస్త్ర విభాగం, దక్షిణాఫ్రికాలోని క్వాజులు – నాటల్ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ శ్రీకాంత్ జొన్నలగడ్డచే నీటి చికిత్స కోసం ఆధునాతన ఆక్సీకరణ ప్రక్రియలపై ఉపన్యాసం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీటి శుద్ధీకరణ కోసం ఆధునాతన ఆక్షీకరణ ప్రక్రియలో ఏవోపీఎస్ ప్రాముఖ్యతను, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై అవగాహన కల్పించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కోర్సు కోఆర్డినేటర్ పుత్రియా, మాజీ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ప్రొఫెసర్ టి.అశోక్, విద్యార్థులు హాజరయ్యారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహనిర్మాణ సంస్థ ఏఈ వైవీ వెంకట్రావు అన్నారు. శనివారం మండలంలోని వెంకట్రావుపాలెం, మోదుగ గుంట, మెట్ట ఉప్పరగూడెంలో మన ఇల్లు – మన గౌరవం కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. వెంకట్రావుపాలెం లే అవుట్‌లో ఏఈ వెంకట్రావు మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగిరపర్చాలన్నారు. ఇంటి నిర్మాణానికి మెటీరియల్, అడ్వాన్స్‌గా నగదు తీసుకొని ఉంటే వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లను 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని అన్నారు. సర్పంచ్‌లు ఎలిపే గాంధీ, మర్లపాటి వీరవెంకట సుబ్బలక్ష్మి, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంఘం 148వ సభా కార్యక్రమం మూడో వార్డులో శనివారం రాత్రి అధ్యక్షులు సూరంపూడి వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించారు. సంగీత విద్వాంసురాలు చిక్కాల సుస్మితచే నిర్వహించిన కచేరీ ప్రేక్షకులను అలరించింది. మృదంగంపై సరస్వతుల హనుమంతరావు, వైలన్‌పై కేటీ సుబ్బరాయన్ వాయిద్య సహకారం అందించారు. కళాసత్కారం, ఉద్యోగ సేవా పురస్కారం, ఆర్థిక సహకారం అందజేశారు. కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు, ఏపీ నాటక పరిషత్తుల సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు, దేవికారాణి ఉడయార్, కేవీ రామారావు, జోగేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి మాస బాబురావులు హాజరైయారు.

ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్: కొమ్ముగూడెం జెడ్పీ హైస్కూలుకు చెందిన బాలబాలికలు స్కూలు గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14, -17 బాలబాలికల విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చారని హెచ్ఎం జి.శ్రీనివాసరావు తెలిపారు.